# గ్రీన్‌కోకు ప్రభుత్వ సహకారం

**- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ - ప్రాజెక్టు సందర్శన**

గ్రీన్ కో జల విద్యుత్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్లు

**ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి**

గ్రీన్ కోకు ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని డిప్యూటీ సీఎం కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. శనివారం ఆయన కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని రెన్యూవబుల్ గ్రీన్‌కో ప్రాజెక్టును సందర్శించారు. తొలుత విమానంలో ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుని హెలికాప్టర్ ద్వారా సోలార్, జలవిద్యుత్ ప్రాజెక్టులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా గ్రీన్‌కో కార్యాలయం వద్దకు చేరుకుని ప్రాజెక్టు నమూనాను తిలకించారు. ప్రాజెక్టు గురించి సిబ్బంది, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రీన్‌కో రాష్ట్రంలో ఇప్పటికే రూ.30 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిందని, మరో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుందని తెలిపారు. ఇప్పటి వరకు 12 వేల మందికి ఉపాధి కల్పించారన్నారు. గ్రీన్‌కో ప్రాజెక్టులో అటవీ శాఖ నిబంధనలు ఉల్లంగిస్తున్నట్లు రావడంతో పరిశీలించేందుకు వచ్చానన్నారు. పిన్నాపురం ప్లాంటుకు సంబంధించి 2800 ఎకరాల్లో ప్రాజెక్టు ఉందని, 1700 ఎకరాలను కంపెనీ కొనిందని, 365 హెక్టార్ల అటవీ భూమిని కేంద్ర ప్రభుత్వ అనుమతితో తీసుకుందని, 45 హెక్టార్లకు సంబంధించి రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదం ఉందని వివరించారు. ఆ వివాదాలను పరిష్కరించాలని ఉన్నతాధికారులకు చెప్పామన్నారు. గ్రీన్‌కో ప్రాజెక్టు భవిష్యత్ లో గొప్ప సందర్శన ప్రదేశంగా, ఎడ్యుకేషన్ టూర్ ప్రాంతంగా తయారవుతుందని తెలిపారు. రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో మూడో వంతు విద్యుత్‌ను గ్రీన్ కో ప్రాజెక్టు ఉత్పత్తి చేస్తుందన్నారు. దేశానికే పేరు తెచ్చే ప్రాజెక్టు అని, ఏదైనా వివాదాలు ఉన్నా పరిష్కరించి సహకరిస్తామని తెలిపారు. సిఎస్ఆర్ కింద గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం, పశు సంపద పెంచేందుకు కృషి చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుని విమానం ద్వారా గన్నవరానికి తిరుగు ప్రయాణం అయ్యారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, గ్రీన్ కో ఎండి అనిల్ చలమలశెట్టి, కర్నూలు కలెక్టర్ పి.రంజిత్‌బాష, నంద్యాల కలెక్టర్ జి.రాజకుమారి, నంద్యాల ఎస్‌పి అదిరాజ్ సింగ్ రాణా, డిఎఫ్ఒ శ్యామల, గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రతినిధి కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు టర్బైన్స్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం

హెలికాప్టర్ నుండి పరిశీలిస్తున్న పవన్ కళ్యాణ్

# మోడీకి నిరసన సెగ

**ప్రజాశక్తి-కర్నూలు ప్రత్యేక ప్రతినిధి**

ఈ వారంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడి విశాఖపట్నం పర్యటనకు నిరసన సెగ తగిలింది. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల ప్రధాని మోడీ అనుసరిస్తున్న తీరు సరైంది కాదని సిపిఎం ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిరసన ప్రదర్శనలు చేశారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కూడా ప్రజలను మోసగించారని, రాష్ట్ర అభివృద్ధి పట్టని మోడీ పర్యటనను వ్యతిరేకిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపులో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో భారీ నిరసన ప్రదర్శన చేశారు. కలెక్టరేట్ల ముందు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, విభజన హామీలు అమలు చేయాలి, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్టించుకోవాలి. మోడీ గో బ్యాక్ అంటూ పెద్ద పెట్టున నినదించారు.

ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) మూడు రోజులపాటు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. చివరి రోజు కర్నూలు శివార్లలోని ఎపి ఇఆర్‌సి కార్యాలయంలో కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప జిల్లాల సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు, వినియోగదారులు పాల్గొని అభ్యంతరాలను తెలిపారు. సెకీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని, విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని పలువురు వక్తలు కోరారు. ప్రజలపై విద్యుత్ భారాలు సరికాదన్నారు. టైం ఆఫ్ డే టారిఫ్ విధానంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని విన్నవించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ప్రజాభిప్రాయాలను సేకరించింది. నేరుగా, ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలను స్వీకరించారు. 16 మంది తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని డొక్కా సీతమ్మ పేర రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. దీని ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ముఖ్యఅతిథిగా వచ్చారు. నంద్యాల జిల్లాలో న్యాయ శాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్, బనగానపల్లెలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఆయా నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపిలు ప్రారంభించారు. కర్నూలు జిల్లాలో మొత్తం 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 8679 మంది విద్యార్థులకు, నంద్యాల జిల్లాలో 21 జూనియర్ కళాశాలల్లో 5672 విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం నిర్ధేశించిన మెనూ ప్రకారం అమలు చేస్తున్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నంద్యాల జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలని కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. బ్యాంకు, ఇన్సూరెన్స్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి ఇస్తేమా కార్యక్రమం ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఆత్మకూరులో నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు ఒక దగ్గర చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రేషన్ షాపులలో డీలర్ల ఖాళీల భర్తీకి సివిల్ సప్లయ్ అధికారులు పరీక్షలు నిర్వహించారు. చేనేత వస్త్రాల సంచార అమ్మకపు వాహనాన్ని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష ప్రారంభించారు. కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల కాలుష్య నియంత్రణకు రూ.7.87 కోట్లతో ఆమోదం తెలిపారు. నటరాజ నృత్య కళామందిర్, టిజివి కళాక్షేత్రం ఆధ్వర్యంలో కర్నూలులో మూడు రోజుల పాటు జాతీయ నృత్య పోటీలను నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి శాస్త్రీయ నృత్య కళాకారులు హాజరయ్యారు.

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు వారం రోజుల పాటు నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి టిజి.భరత్ కూతురు వివాహ విందును జిల్లా చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించారు. ఎస్‌ఎపి క్యాంపు మైదానంలో సినియా సెట్టింగులను మరిపించే రీతిలో ఏర్పాట్లు చేశారు. సంగీత విభావరి , వేలాది మందికి పసందైన విందుభోజనం ఏర్పాటు చేశారు. వివిధ రంగాల ప్రముఖులు, స్థానిక ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

**- ఎస్‌పి జి.బిందు మాధవ్**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

సంక్రాంతి పండగను పురస్కరించుకొని జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, శివార్లు, ఇతర ప్రాంతాల్లో కోడి పందాలు,పేకాట వంటి జూదాలు నిర్వహించడం నిషేధమని, ఎవరైనా కోడిపందేలు, జూదాలు ఆడినా, ప్రోత్సహించినా, సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి పండుగను నేపథ్యంలో కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో కోడి పందేలు, జూదాలు తదితర అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పోలీసు అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఆదేశించారు. సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి సంక్రాంతి జరుపుకోవాలని, సాంప్రదాయ సంక్రాంతి క్రీడా పోటీలు ప్రజల్లో సుహృద్భావ వాతావరణం పెంపొందిస్తాయన్నారు. జిల్లాలో ఎవరైనా కోడి పందేలు నిర్వహించినా, పందేల నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా, జూదం నిర్వహించినా కఠిన చర్యలు తప్పవన్నారను. కొందరు యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కొని తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఉద్యోగాలు పొందే సమయంలో, పాస్‌పోర్ట్ పొందే సమయాలలో ఈ కేసులు అడ్డంకిగా మారి యువత జీవితాలు అధోగతి పాలవుతాయనే విషయాన్ని గుర్తుంచు కోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడి పందెం, జూదం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ - 100కు, డయల్ 112 కు, పోలీసు కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 7777877722కు సమాచారాన్ని అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌పి పేర్కొన్నారు.

# కిటకిటలాడిన ఆర్‌టిసి బస్టాండ్

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

సంక్రాంతి పండగకు తమ సొంత ఊర్లకు వెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుండి ప్రయాణికులు బయలుదేరాడంతో కర్నూలు బస్టాండు కిటకిట లాడింది. ఏ బస్సు వచ్చినా సీట్ల కోసం ప్రయాణికులు పరుగులు తీసి బస్సు కిటికీల నుండి ఎగబాకడం కనపించింది. సీట్లు దొరికిన వారు సీట్లలో కూర్చుంటే, దొరకని వారు నిల్చుని ప్రయాణం చేశారు. ఏ బస్సు చూసిన కిక్కిరిసే ప్రయాణికులతో వెళ్ళింది. కర్నూలు నుండి చెన్నైకి 4, నెల్లూరు 2, హైదరాబాద్ 80, బెంగళూరు 40, విజయవాడ 20, తిరుపతి నాలుగు మొత్తం 150 ప్రత్యేక బస్సులను తిప్పుతున్నట్లు ఆర్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. బస్టాండ్ కాకుండా నగరంలోని ప్రధాన వీధులన్నీ ఆటోలలో గ్రామాలకు వెళ్లడంతో ట్రాఫిక్ జామ్ అయిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆటోలలో ప్రయాణించే ప్రయాణికుల నుండి మామూలు చార్జి కన్నా ఎక్కువ వసూలు చేశారు. విధిలేని పరిస్థితుల్లో ప్రయాణికులు ఆటోల్లో కూడా ఎక్కువమంది ఎక్కి ప్రయాణించడం కనిపించింది.

ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

# కోరమండల్ సేవలు అభినందనీయం

**- కప్పట్రాళ్ల సంక్రాంతి సంబరాలలో ఆకె రవికృష్ణ**

**ప్రజాశక్తి - దేవనకొండ**

కోరమాండల్ కంపెనీ చేసే రైతు సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో మంచి దిగుబడులు, నాణ్యమైన పంటలు పండించాలని ఈగల్ ఐజి ఆకె.రవికష్ణ సూచించారు. కర్నూలు జిల్లా ఎస్‌పిగా పని చేస్తున్న సమయంలో ఆకె.రవికృష్ణ కప్పట్రాళ్ల గ్రామాల్ల గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అప్పటి నుంచి ఆయన ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమైన పండుగలు, ఆయన పుట్టిన రోజును కప్పట్రాళ్లలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. గ్రామంలో రైతులకు మహిళలకు, విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో,ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆకె. రవికృష్ణ, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్, కోరమండల్ వైస్ ప్రెసిడెంట్ జివి.సుబ్బారెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. ఆకే.రవికష్ణ మాట్లాడుతూ కోరమాండల్ కంపెనీ చేసే రైతు సేవా కార్యక్రమాలు, రైతు సేవలు సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో మంచి దిగుబడులు , నాణ్యమైన పంటలు పండించాలని సూచించారు. విద్యార్థులు, యువత ప్రతి ఒక్కరు సమయాన్ని సద్వినియోగం చేసుకుని విజయాలను సొంతం చేసుకోవాలని, మంచి జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు జోనల్ మేనేజర్ ఎం.గోవిందరావు, సీనియర్ ఆగ్రోనామిస్ట్ టి శ్రీధర్ రెడ్డి, కంపెనీ సేల్స్ ఆఫీసర్ ఎం.రఘు కుమార్, ఆగ్రోనోమిస్ట్ శ్రవణ్ కుమార్ , కంపెనీ ఇతర సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఈగల్ ఐజి రవికృష్ణ

# సమాజ చైతన్యానికి కళలు పునాది కావాలి

**- ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్**

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

సమాజ చైతన్యానికి కళలు పునాదిగా మారాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనీల్ కుమార్ అన్నారు. కర్నూలు నగరంలోని స్థానిక కె.కె. భవన్లో ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముందుగా సప్ధర్‌హస్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆ సంఘం ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి .గౌస్ దేశాయ్, వైయస్సార్ టియుసి జిల్లా అధ్యక్షులు భీమేశ్వర్ రెడ్డి, పందిపాడు టిడిపి నాయకులు పూల శంకర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఆనంద్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.వి. నారాయణ, ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురు శేఖర్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్. అలివేలు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఇ. నాగరాజు చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి పిఎన్ఎం జిల్లా ఉపాధ్యక్షులు ఎం. లోకేష్ అధ్యక్షత వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రజానాట్య మండలి నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను అధ్యయనం చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పాలకులను కళల ద్వారా ప్రశ్నిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తుందన్నారు. కళ కళ కోసం కాకుండా సమాజం కోసం ఉపయోగపడేలా ఉండాలన్నారు. అందుకు సప్ధర్‌హస్మి జీవితం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కళలు చైతన్యాన్ని నింపేవిగా ఉండాలన్నారు. ఆ దిశగా అమరుల చిత్రాలతో కూడిన నూతన క్యాలెండరును ప్రజానాట్య మండలి ప్రచురించడం అభినందనీయమన్నారు. క్యాలెండర్ ప్రచురణకు సహకరించిన ధాతలకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే సహకారాన్ని, స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఈ సందర్భంగా పలు అభ్యుదయ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు రాంబాబు, నోమేశ్వరి, బతుకన్న, సుంకన్న, సుబ్బరాయుడు, పెద్ద కాశీ విశ్వనాథ్, చిన్న కాశీ విశ్వనాథ్, ఆనంద్, నాగస్వాములు, బజారన్న, మధు, సరిత, లక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు అనిల్ కుమార్, డి.గౌస్ దేశాయ్ తదితరులు

# మన సంస్కృతికి నిలువుటద్దం సంక్రాంతి

**- ముగ్గులు వేయడం ప్రపంచంలో మన దేశానికే ప్రత్యేకం : డాక్టర్ శంకర్ శర్మ**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

మన సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దం సంక్రాంతి పర్వదినం అని సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు బంగారు పేటలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీలో సీనియర్ గ్యాస్ట్రోఎంటరాల జిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ పాల్గొన్నారు. మహిళా సమాఖ్య నాయకులు గిడ్డమ్మ ,శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించు కొని బంగారుపేటలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడంతో పాటు అందులో ముగ్గులు వేయడంలో ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులను పంపిణీ చేయడం అభినంద నీయమని చెప్పారు. సంక్రాంతి పర్వదినం మన సంస్కృతిని, నాగరికతను తెలియ జేస్తుందని వివరించారు. ఇక్కడ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు తమ కళాత్మక హృదయాన్ని ముగ్గులు వేయడం ద్వారా ప్రదర్శించారని ప్రశంసించారు. ఈ ముగ్గుల పోటీల్లో భాగంగా మహిళలు వేసిన రంగు రంగుల ముగ్గులు వారి అభిరుచులకు అద్దం పట్టాయని చెప్పారు. ముగ్గులు వేయడం మన దేశ నాగరికతకు చిహ్నమని, ఇలాంటి ముగ్గులు వేసే సంస్కృ ప్రపంచంలో ఏ దేశంలో లేదని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. మహిళలకు సాధికారత, స్వావ లంబన ముఖ్యమైనదని వివరించారు. ఈ సంక్రాంతి పర్వదినం ప్రజలందరి జీవితాలలో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కర్నూలు నగర ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ముగ్గులను పరిశీలిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ (ఇన్‌సెట్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ)

# వడ్డే ఓబన్న సేవలు అందరికీ ఆదర్శం

**- ఎంపి బస్తిపాటి నాగరాజు**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకమైన పాత్రను పోషించిన సమరయోధుడు వడ్డే ఓబన్న చేసిన సేవలను ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన నగరంలోని తన కార్యాలయంలో ఓబన్నకు నివాళులర్పించారు. ఎంపి మాట్లాడుతూ మొదటి తరం స్వాతంత్ర్య సమరయోధుడుగా పేరుగాంచిన వడ్డే ఓబన్న , ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైనిక అధ్యక్షుడిగా పని చేశారన్నారు. రైతులపై బ్రిటిష్ వారు విధించిన పన్నులకు వ్యతిరేకంగా 1845లో నిర్వహించిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. తొలి నుండి వడ్డే ఓబన్న పేద రైతులు, గ్రామస్తుల హక్కులను కాపాడడానికి వారికి న్యాయం చేయాలని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ప్రతిఘటించి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. వడ్డే ఓబన్న చేసిన పోరాట పటిమను భవిష్యత్తు తరాల వారికి తెలిచేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారంగా నిర్వహిస్తుందని తెలిపారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎస్ఐ

**ప్రజాశక్తి-వెల్దుర్తి**

యువతకు క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయని ఎస్ఐ అశోక్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా బొమ్మన శివశంకర్ రెడ్డి స్మారకార్థం మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. హైస్కూల్ పిఎంసి ఛైర్మన్ ముత్యాల చిన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సూపర్ 8 క్రికెట్ టోర్నమెంట్ ను ఎస్ఐ అశోక్, టిడిపి మండల అధ్యక్షుడు బలరాం గౌడ్, నాయకులు రమాకాంత్ రెడ్డి, సుధాకర్ గౌడ్ ప్రారంభించారు.

# మైపర్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్** : కర్నూలు ఎ క్యాంపులో మైపర్ ఫార్మసీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.సురేష్‌బాబు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జెఎన్‌టియు అనంతపురం వారు డాక్టర్ ఎ.శివకుమార్ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్స్ జెఎన్‌టియు అనంతపురం నుంచి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు వారి భవిష్యత్తు ఎలా తీర్చిదిద్దుకోవాలో తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిముల ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కోసం ఏ ఏ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనేది తెలిపారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్‌స్టెల్లా సతీష్, వైస్ ప్రిన్సిల్ డాక్టర్ కాసర్ల సురేష్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ రాజకుమార్ ఐక్యూఎసి కోఆర్డినేటర్ రఘువీర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు స్పోర్ట్స్ , కల్చరల్ కార్యాక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

## రాయల్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్**

రాయల్ మహిళ సంఘం , బలిజ సంఘాల ఆధ్వర్యంలో శనివారం మాంటిస్సోరి పాఠశాలలో "రాయల మహిళలు-రంగవల్లులు" కార్యక్రమం తో ముగ్గుల పోటీలను రాయల్ మహిళ సంఘం నాయకురాలు సుధా వర్శిని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధావర్శిని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని ముగ్గుల పోటీల్లో అరుదైన గౌరవం దక్కే మంచి కార్యక్రమం అన్నారు. రాయల్ మహిళ సంఘం ఆధ్వర్యంలో లక్ష్మి పూజ, ఎహిళ దినోత్సవం, సంక్రాంతి ముగ్గుల పోటీలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని అత్యధిక సంఖ్యలు మహిళలు పాల్గొంటున్నారన్నారు. వచ్చే ఏడాది ఈ పోటీలను జిల్లా వ్యాప్తంగా చేస్తామని మరింత మంది మహిళలు పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు నేటి సమాజంలో జరుగుతున్న దాడులు ,అసమానతలు అన్నింటిలో కూడా తగిన న్యాయం జరిగేలా ప్రతి మహిళ ముందుండాలని తెలిపారు. పోటీలలో దాదాపు 50 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలకు అతిథులు మహుమతులు ప్రదానం చేశారు.

బహుమతులు అందజేస్తున్న అతిథులు పత్తిఓబులయ్య, తదితరులు

# డిప్యూటీ సిఎంను కలిసిన ఎస్‌పి, కలెక్టర్

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కు కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష, ఎస్‌పి బిందుమాధవ్ స్వాగతం పలికారు. ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు వచ్చిన ఆయనకు పలువురు స్వాగతం పలికారు. అల్ట్రా మెగా సోలార్ పార్క్, ప్రపంచంలోనే మొదటిది , పెద్దది అయిన గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ఏరియల్ వ్యూ సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా శనివారం కర్నూలు ఎయిర్‌పోర్టులో పవన్‌కళ్యాణ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## ఆలూరు టిడిపి ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్

**ప్రజాశక్తి-ఆస్పరి**

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు టిడిపి ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అట్టేకల్లు గ్రామంలో బంగి ఈశ్వరమ్మ అనే మహిళా రైతు నాలుగు పశువులకు రూ.1,85,000తో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఆలూరు టిడిపి ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాడి పశువుల అభివృద్ధి, రైతుల సంతోషమే సీఎం చంద్రబాబు నాయుడు ఆశయం అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మినీ గోకులం షెడ్లను పశువులు ఉన్న ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు పశువులకు రూ.లక్ష 1.15 వేలు,నాలుగు పశువులకు రూ.1,85 వేలు, ఆరు పశువులకు లక్షల రూ.2.30 లక్షలతో ప్రభుత్వం గోకులం షెడ్ల నిర్మిస్తుందన్నారు. అర్హులైన రైతులు ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ముందుగా టిడిపి నాయకులు కార్యకర్తలు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలా శ్రీ, ఎంపిటిసి రహీంతుల్లా, మాజీ ఎంపిటిసి శివకుమార్, సొసైటీ సంఘం చైర్మన్ బసవరాజు, టిడిపి మండల కార్యదర్శి శేషాద్రి నాయుడు, మాజీ మండల కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, ఎపిఒ రామకృష్ణ, నాయకులు మల్లికార్జున, సతీష్, యుగంధర్, రాజకుమార్, వీరేష్ హనుమంతు రెడ్డి, రంగనాథ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అట్టెకల్లులో గోకులంషెడ్డును ప్రారంభిస్తున్న వీరభద్రగౌడ్

**హాలిగేరలో మినీ గోకులం షెడ్ ప్రారంభం**

మండల పరిధిలోని హాలిగేర గ్రామంలో రైతు తలారి నల్లగుట్టయ్య ఆరు పశువులకు రూ. 2.30లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్ ను ఎంపిటిసి రహీం తుల్లా,సర్పంచి లింగమ్మ, జనసేన పార్టీ సీనియర్ నాయకులు సోమశేఖర్, వీరేష్, మోహన్‌లు ప్రారంభించారు. జనసేన ప్రధాన కార్యదర్శి లు వీరేష్, హనుమేష్, మహదేవ్,హనుమంతు, ఉపాధి ఇసి ఖాజా హుస్సేన్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

# వైసిపి ఎమ్మిగనూరు అధ్యక్షుడుగా నాగేశప్ప

**ప్రజాశక్తి-ఎమ్మిగనూరు**

ఎమ్మిగనూరు మునిసిపాలిటీ వైసిపి పట్టణ అధ్యక్షుడిగా నాగేశప్పను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. శనివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్లోని వైసిపి కార్యాలయంలో కమార్క నాగేశప్ప విలేకర్ల సమావేశంలో ఆనందాన్ని వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకకు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే కె.చెన్నకేశవరెడ్డికి, జిల్లా ఉపాధ్యక్షులు కె.జగన్ మోహన్‌రెడ్డికి, వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు వై.రుద్రగౌడ్‌కు మునిసిపల్ చైర్మన్ డాక్టర్ రఘుకు,వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్‌కు,చేనేత జిల్లా అధ్యక్షులు ఎంకె. శివ ప్రసాద్‌కు, జిల్లా అధికార ప్రతినిధి సునీల్ కుమార్‌కు కౌన్సిలర్లకు, వార్డు ఇన్‌చార్జులకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉన్నప్పటికీ, ప్రజల సమస్యలను ప్రభుత్వ ముందుంచి సమర్థంగా పోరాడటానికి మా పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. నాకు అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వహిస్తానన్నారు. ప్రజల నమ్మకాన్ని, పార్టీ గౌరవాన్ని నిలబెట్టడమే నా లక్ష్యమన్నారు. ప్రజా సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ చర్యలను పర్యవేక్షించడంతోపాటు పార్టీ మార్గదర్శకాల ప్రకారం ప్రజలతో నిటారుగా నిలిచి న్యాయం చేస్తామన్నారు. కౌన్సిలర్ మీసాల నీలకంఠ, పాల శ్రీనివాస్ రెడ్డి, గడిగే చంద్రశేఖర్, సోమేశ్, పామయ్య, నరసింహులు,లతారెడ్డి, కడిమెట్ల నాగార్జున రెడ్డి, గోకరమ్మ, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాలయాల ప్లాటినం జూబ్లీ వేడుకకు పీఠాధిపతులకు ఆహ్వానం

**ప్రజాశక్తి-మంత్రాలయం**

విద్యాలయాల ప్లాటినం జూబ్లి వేడుకకు శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులను ఆహ్వానించామని కమిటీ సభ్యులు మాచాని వెంకటేష్ పారిశ్రామిక వేత్త సామాజిక సేవా కర్త మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, డాక్టర్ వెంకటేశ్వరరావు, కామలే గణేష్, ఈరన్న గౌడులు తెలిపారు. శనివారం మంత్రాలయం చేరుకున్న వారు పీఠాధిపతులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో ఈనెల 12న తేదీన ఆదివారం నిర్వహించు 75 సంవత్సరాల ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల వజ్రోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఠాధిపతులను ఆహ్వానించామని చెప్పారు. స్పందించిన ఆయన వేడుకలు ఘనంగా జరిగాలని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆశీస్సులు నిండుగా ఉంటాయని ఆశిస్సులు అందించి శేషవస్త్రం ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించి నిర్వాహకులను అభినందించారని తెలిపారు. ఈ విద్యాలయాల్లో చదివి ఉన్నత స్థాయికి చేరుకొన్న వారు కోకొల్లలని కొనియాడారు.

ఆహ్వానం అందజేస్తున్న విద్యాలయా లనిర్వహకులు

## మంత్రాలయంలో కర్ణాటక హైకోర్టు జడ్జి ఉమ

**ప్రజాశక్తి మంత్రాలయం**

సద్గురు రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి ఎంజి ఉమ మంత్రాలయం వచ్చారు. శనివారం అథిది గృహం చేరుకున్న ఆమెకు తహసీల్దార్ ఎస్.రవి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీ మఠం అధికారులు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని శనివారం హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు వారికి చీర రవికతో పాటు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న తహశీల్దార్

## ఆలూరు వైసిపి మండల కన్వీనర్‌గా కురవ మల్లికార్జున

**ప్రజాశక్తి - ఆలూరు**

ఆలూరు వైసిపి మండల కన్వీనర్ గా కురవళ్ళి గ్రామనికి చెందిన కురవ మల్లికార్జునను నియమించినట్లు వైసిపి ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి శనివారం తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కన్వీనర్‌గా ఉన్న చిన్న ఈరన్నను వైసిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించిందన్నారు. నూతన మండల కన్వీనర్ కురవ మల్లికార్జున మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామని చెప్పారు. మండల కన్వీనర్ గా తనకు అవకాశం వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

# వడ్డేఓబన్న పోరాట స్ఫూర్తి మరువలేనిది

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

**ప్రజశక్తి -కర్నూలు కలెక్టరేట్**

స్వాతంత్ర సమరయోధుడు వడ్డేఓబన్న పోరాట స్ఫూర్తి మరువలేనిదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పేర్కొన్నారు. శనివారం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డేఓబన్న జయంతి వేడుకలను జనవరి 11న అన్ని జిల్లా కేంద్రాల్లో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వడ్డే ఓబన్న నంద్యాల జిల్లాలోని సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన వడ్డే సుబ్బయ్య, సుబ్బమ్మ దంపతులకు 1807 జనవరి 11న జన్మించారన్నారు.. సమావేశంలో డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, వడ్డే కులానికి చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాష,తిరుపాల్‌బాబు, అధికారులు

**ఘనంగా వడ్డే ఓబన్న జయంతి**

**నందవరం:** నాగలదిన్నె గ్రామంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వడ్డే ఓబన్న జీవితం, స్వాతంత్ర్య పోరాటంలో చేసిన త్యాగం, ధైర్యం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని వడ్డేశీను, భీమన్న, నాగరాజు అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చరిత్ర చిరస్మరణీయమని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన విలువలు, సూచనలు పాటిస్తూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వడ్డెరసంఘం నాయకులు అంజి, లింగన్న, నాగార్జున, జమ్మన్న, వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

నాగులదిన్నెలోవడ్డె ఓబన్న జయంతిలో పాల్గొన్న నాయకులు, యువకులు

**పోరాట వీరుడు వడ్డే ఓబన్న**

**వెల్దుర్తి:** వెల్దుర్తి పాత బస్టాండ్ కూడలిలో పోరాట వీరుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను వెల్దుర్తి మండల వడ్డే సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన మాజీ ఎంపిపి జ్ఞానేశ్వర్ గౌడ్ మాట్లాడారు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటునే ప్రథమ స్వాతంత్ర్య యుద్ధం అంటారన్నారు. అంతకుముందే 1846లో తెలుగునాట ఉయ్యాలవాడ నరసింహ రెడ్డితో కలిసి బ్రిటిష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలుగువారి ఆత్మగౌరవం నిలపడం కోసం వీరోచితంగా పోరాడారని తెలిపారు. ఆనాటి రేనాటి వీరుడు వడ్డే ఓబన్న చరిత్రను నేటి తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. వడ్డే సంఘం వెల్దుర్తి మండల అధ్యక్షులు మహేష్, మారెన్న, మల్లికార్జున, గోవిందు, అయ్యన్న, ఎలనాగి, రాము, బాచి, పవన్ పాల్గొన్నారు.

# ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

## -రైతుల పంటలసిరి సంక్రాంతి పండుగ

**ప్రజాశక్తి -ఎమ్మిగనూరు**

ఎమ్మిగనూరు పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల దీక్ష జూనియర్ కళాశాలలో సిఇఒ తిరుమలరెడ్డి సిఒఒ సుజనా రెడ్డి అధ్యక్షతన ముందస్తు సంక్రాంతి సంబరాలు మిన్నంటే విధంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రావూస్ దీక్ష జూనియర్ కళాశాలల సిఇఒ సిఒ ,ఇరుకళాశాలల ప్రిన్సిపల్స్ ఇర్ఫాన్, మద్దిలేటి , అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం విద్యార్థులతో కలిసి తెలుగువారి దక్షిణ భారతీయ వంటకంగా పిలువబడే సంక్రాంతి పొంగలిని కొత్త బియ్యం, కొత్త బెల్లం, పెసరపప్పు, పాలు, నెయ్యిని ఉడికించి తీపికి గుర్తుగా 'సంక్రాంతి పొంగలి తయారు చేశారు. ఆ తర్వాత చలికాలంలో వచ్చే రోగాలను తరిమి కొట్టాడానికి చిహ్నంగా భోగి మంటలు వేశారు. ఈ భోగి మంటలు చుట్టూ కళాశాలల విద్యార్థులు సంక్రాంతి భోగి పాటలతో అలరించారు.ఉద్దేశించి రావూస్, దీక్ష కళాశాలల సిఇఒ తిరుమలరెడ్డి,సిఒ సుజనారెడ్డి మాట్లాడుతూ తెలుగువారి గ్రామీణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసే ఏకైక పండుగ సంక్రాంతి అని, రైతుల పంటల పండుగగా ప్రసిద్ధి చెందిందని కొనియాడారు. భోగి పండుగ రోజు హరిదాసుల పాటలు, తెలుగింటి ఆడపిల్లలు తమ ఇంటి ముంగిట రంగురంగుల ముగ్గులతో అలంకరణ చేయగా గంగిరెద్దుల కళాకారులు వీధి వీధి తిరుగుతూ ఇంటిని దర్శిస్తారన్నారు. పాడి పంటలకు, తీపికి సంకేతంగా కొత్త పొంగలి తయారు చేస్తారు. సంక్రాంతి పండుగ రోజు కొత్త బట్టలు ధరించి పిండి వంటలు తయారు చేసుకుంటారు. కనుమ పండుగ రోజు పాడి పశువులను అలంకరించి వివిధ పోటీలు నిర్వహిస్తారు. సంక్రాంతి పండుగ పేరు చెప్పగానే కోడిపందేలాట గుర్తుకు రావాలని విద్యార్థులకు తెలిపారు. సంక్రాంతి పండుగను జరుపుకొని భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని ఆ రకంగా దృష్టి సారించాలని విద్యార్థులను కోరారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రావూస్ కాలేజీలో సంక్రాంతి సంబరాలు

రావూస్ కాలేజీలో సంక్రాంతి సంబరాలు

## రైతుల కోసం మినీ గోకులం షెడ్లు

**ప్రజాశక్తి-చిప్పగిరి**

కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా ఉపయోగపడుతుందని మినీ గోకులం షెడ్లను నిర్మిస్తుందని, ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి సుశీలమ్మ, ఎపిఒ జుబేర్ అహ్మద్ తెలిపారు. శనివారం బంటనహాల్ గ్రామంలో నిర్మించిన మినీ గోకులం షెడ్లను సర్పంచి సుశీలమ్మ ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులు ఎపిఒ జుబేర్ అహ్మద్ కు టెక్నికల్ అసిస్టెంట్ మారుతికి శాలువా, పూలదండతో సన్మానించారు. వారు మాట్లాడుతూ నిర్మాణ దశలో ఉన్న వారు కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు. పూర్తయిన వాటికి బిల్లులు త్వరగా మంజూరు చేయుటకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సర్పంచి కుమారుడు టిడిపి సీనియర్ నాయకులు సురేష్, జయన్న ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గోకులం షెడ్డును ప్రారంభించిన ఎంపిడిఒ మణిమంజరి, ఇఒపిఆర్‌డి, రైతులు

## గోకులం షెడ్లతో రైతులకు ఉపయోగం

**ఎంపిడిఒ మణి మంజరి**

**ప్రజాశక్తి -గోనెగండ్ల**

గోకులం షెడ్ల ద్వారా రైతుల కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబన పెంపొందించడమే ధ్యేయమని ఎంపిడిఒ మణిమంజరి ఇఒపిఆర్‌డి అనంతశయన, ఎపిఒ మహమ్మద్ బాష అన్నారు. శనివారం గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో రైతు హరికృష్ణ నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డును వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండలంలో 60 కి పైగా గోకులం షెడ్ల కోసం ప్రతిపాదనలు పంపగా 20 మంజూరయ్యాయని వీటిలో 7 నిర్మాణం పూర్తయ్యాయన్నారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని, వీటిని కూడా వీలైనంత త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకొని రైతులు ప్రారంభించుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోకులం షెడ్లలో పశుపోషణ ద్వారా పాలు పెరుగుతో ఆదాయంతో పాటు వాటి పేడ ఎరువుల ద్వారా పొలాలు సారవంతమై అధిక దిగుబడులను ఇస్తాయన్నారు. ప్రతి సంవత్సరం పశువుల సంతతి పెరిగిపోయి ఫలితంగా రైతుల కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని అన్నారు. రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని పశుసంపద పెంచుకోవడం ద్వారా ఆర్థికాభివద్ధి పొందాలన్నారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, తిరుపతయ్య నాయుడు, వేముగోడు గ్రామ నాయకులు నరసింహ, అలిపీర, అంపయ్య, బండపల్లి, కొత్తింటి ఫక్రుద్దీన్, గౌండరహమతుల్లా, అక్బర్, నాగన్న, డీలర్ ఫక్రుద్దీన్ ఉపాధి హామీ పథకంఇసి ఉస్మాన్‌సిబ్బంది పాల్గొన్నారు.

## రెండోసారి మండల కార్యదర్శిగా కారంనాగరాజు

**ప్రజాశక్తి-పత్తికొండ**



పత్తికొండ నియోజకవర్గం వైసిపి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మంగళవారం పత్తికొండ మండల కార్యదర్శిగా కారంనాగరాజను నియమించారు. పత్తికొండలో మీడియాతో నూతన పత్తికొండ మండల కార్యదర్శి కారం నాగరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతానని అన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్రజలకు వివరిస్తానని అన్నారు. నాపై ఎంతో నమ్మకంగా రెండవసారి మండల కార్యదర్శి బాధ్యతలను అప్పచెప్పినందుకు వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్ వివిమోహన్ రెడ్డి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా గుణంపల్లి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్**

కల్లూరు అర్బన్ 31 వ వార్డు టిడిపి నాయకులు గుణంపల్లి శ్రీనివాసరెడ్డి 37వ జన్మదిన వేడుకలను స్థానిక రాఘవేంద్ర నగర్ సెంటర్లో అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. బంధుమిత్రులు అభిమానుల కోలాహలం మధ్య మధ్య కేక్ కట్ చేసి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు బంధుమిత్రులు నాయకులు లోకేశ్వర్ రెడ్డి, రవీంద్రారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, లింగా రెడ్డి, శ్రీనివాసులు, రామిరెడ్డి, సంజీవ, మాలిక్ పాల్గొన్నారు.

# ముగిసిన జూనియర్ నేషనల్ రోల్‌బాల్ పోటీలు

**ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట**

రిడ్జ్ పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న జూనియర్ నేషనల్ రోల్‌బాల్ పోటీలు శనివారం ఘనంగా ముగిశాయి. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ దేశంలోని 20 రాష్ట్రాల నుండి విద్యార్థులు మా కర్నూలు నగరానికి విచ్చేసి రిడ్జ్ పాఠశాలలో జాతీయస్థాయి క్రీడలు ఆడటం అన్నది మాకు ఎంతో సంతోషకరమని అన్నారు. మీరందరూ క్రీడలతో పాటు చదువులోనూ గొప్పగా రాణించాలని, మీ చదువుకు ఈ క్రీడానుభవమును స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో గొప్పగా స్థిరపడగలరని ఆకాంక్షించారు. స్కేటింగ్ తో రోల్‌బాల్ ఆడటం సాహసంతో కూడిన ఆట అన్నారు. ఈ ఆటను జాతికి పరిచయం చేసిన రాజు మాస్టర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం పాఠశాల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య మాట్లాడుతూ క్రీడల వల్ల మంచి సహృదయత పెరుగుతుందన్నారు. జాతీయస్థాయి క్రీడల వల్ల విద్యార్థులలో స్నేహభావం పెంపొందుతూ ఎక్కడ ఏ విధంగా మసులుకోవాలో తెలుస్తుందన్నారు .వేరే ప్రాంతాలకు వెళ్లడం వల్ల ఆ ప్రాంత అలవాట్లు ,కట్టుబాట్లు మనకు తెలుస్తూ జాతీయత పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థలచైర్మన్ జివిఎం.మోహన్‌కుమార్, పాఠశాల సిఇఒ జి.గోపీనాథ్, రవీంద్ర గ్లోబల్ స్కూల్ సిఇఒ జి.వంశీధర్ రోల్ బాల్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రమౌళి ,,రోల్ బాల్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కన్వీనర్ సునీల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న టిజి.వెంకటేష్

# డి. రాజులు యాదవ్‌కు ఘన సన్మానం

**ప్రజాశక్తి-కర్నూలుక్రైమ్**

నంద్యాల చెక్ పోస్ట్ దగ్గర ఉన్న శ్రీకృష్ణ టెంపుల్‌లో శ్రీకృష్ణ జయంతి ఉత్సవ కమిటీకి శాశ్వత ఫండ్‌కు గాను రూ.లక్ష విరాళంగా అందజేసిన నంద్యాల జిల్లా గోపవరం వాసి ప్రస్తుతం కర్నూలులో నివాసముంటున్న డొందపాటి రాజులు యాదవ్ శ్రీకృష్ణ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు జెవి.కృష్ణయ్య యాదవ్, అయ్యన్న యాదవ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, శ్రీరాములు, ఎస్.శేఖర్, యాదవ పెద్దలు బి.తిమ్మయ్య ,సోమన్న శాలువ, మెమెంటోతో రాజులుని ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన యాదవులందరూ రాజుని శాలువలతో సన్మానించారు. శ్రీకృష్ణ జయంతి ఉత్సవ కమిటీ గత 10 నెలలుగా శాస్విత ఫండ్ కోసం చేస్తున్న కృషిని,వారి ప్రయత్నాలు చూసి ఆకర్షితుడయిన దొండపాటి రాజులు యాదవ్ రూ.లక్ష విరాళంగా ప్రకటించడమే గాక వెంటనే డబ్బు అందజేసి యాదవ జాతికి ఆదర్శంగా నిలిచారన్నారు. యాదవ హక్కుల పోరాట సమితి మహిళా నాయకురాలు విజయలక్ష్మి , కార్య వర్గ సభ్యులు తిక్కన , ఎంఇఒ ఓంకార్,శ్రీధర్,నారాయణ యాదవ్, బాలకృష్ణ యాదవ్, రిటైర్డ్ టీచర్ బాలమద్దయ్య యాదవ్, సౌరయ్య యాదవ్, పుల్లయ్య యాదవ్, సుబ్బారాయుడు యాదవ్ పాల్గొన్నారు.



## హక్కుల కోసం నిరంతరం పోరాడాలి : సిఐటియు

**ప్రజాశక్తి - ఆదోని**

కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటాలకు సన్నద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, జిల్లా నాయకులు రామాంజనేయులు తెలిపారు. సుందరయ్య భవన్ ఆవరణంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన, గోపాల్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి సీనియర్ నాయకులు వీరన్న, మహానంద రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి హాజరయ్యారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి అంజిబాబు. జిల్లా నాయకులు రామాంజనేయులు మాట్లాడారు. అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు అన్ని చట్టాలు వర్తింప చేస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చి ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో స్కీం వర్కర్లు, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చేసిన వాగ్దానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. స్కీం వర్కర్లకు జీతాలు పెంచకుండా ఆలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగమైన ఆటో, భవనం నిర్మాణం కార్మికులు, హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే మున్సిపాలిటీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరి రెగ్యులర్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నెలకు రూ28 వేల జీతం వర్తింప చేసేలా ప్రభుత్వం జిఒ విడుదల చేయాలన్నారు. కార్మికులందరూ తమ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కృష్ణమూర్తి, శంకర్, రంగ, వీరన్న, వీరప్ప, వరలక్ష్మి, సోమక్క, పుష్ప, పద్మ, నరసప్ప ఉన్నారు.

మాట్లాడుతున్న రామాంజనేయులు , వేదికపై అంజిబాబు, వీరన్న తదితరులు

## ఉప ముఖ్యమంత్రికి ఆత్మీయ స్వాగతం

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

ఓర్వకల్లు మండలంలోని గని గ్రీన్ కో సోలార్ పార్క్, గ్రీన్ కో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పరిశీలన కోసం ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ విజయవాడ నుండి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు మ.12:55 గం.లకు చేరుకున్నారు. ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు జయ నాగేశ్వర రెడ్డి, బొగ్గుల దస్తగిరి, జిల్లా ఎస్‌పి బిందు మాధవ్, గ్రీన్ కో సిబ్బంది, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, డిఎస్పీ వెంకట రామయ్య తహశీల్దార్ విద్యా సాగర్ తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఓర్వకల్లు ఎయిర్ పోర్టు నుండి హెలికాప్టర్‌లో గ్రీన్ కో సోలార్ పార్క్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సైట్ ఏరియల్ వ్యూ కోసం ఉప ముఖ్యమంత్రి బయలుదేరి వెళ్లారు.గ్రీన్ కో సోలార్ పార్క్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పర్యటన కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకొని సా. 5గం.లకు ఓర్వకల్లు ఎయిర్ పోర్ట్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి ఉప ముఖ్యమంత్రి బయలుదేరి వెళ్లారు.

**మహారాజశ్రీ కర్నూలు మొదటి అదనపు**
**జిల్లా న్యాయమూర్తి వారి కోర్టులో**
**ఓ.యస్. నెం. 119/2017**

శ్రీమతి.వి.సుగుణ దేవి. ...వాది

**-ఎదురి-**

వి.రమేష్ మరియు ఇతరులు. ...ప్రతివాదులు

**7వ ప్రతివాది కి దావా సమన్లు**

7) బెల్లంకొండ రంగస్వామి తండ్రి బి రంగన్న,
ఓ.సి.సి. సర్వీస్, ఆంధ్ర బ్యాంక్ (ప్రస్తుతము)
ఇండియన్ బ్యాంక్, రీజినల్ ఆఫీస్, కర్నూలు

పై దావలోని వాది తనకు చెందవలసిన ఆస్తి బాగా పరిష్కారము నిమిత్తము ప్రతివాదులు 1 నుండి 9 వరకు పైన కన పరచిన వాది మీ పైన దావా దాఖలు చేసియున్నారు . ఇందులో 7వ ప్రతివాది అయినా మీకు సమన్లు ముట్టనందున కోర్టు వారు ఈ పత్రిక పరంగా సమన్లు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కావున పై దావా పై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 27-1-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు మీరు కాని మీ తరపు వకీల్ ద్వారా కాని హాజరై తెలుపు కొనగలరు. లేనియెడల సదరు దావ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా : 27-1-2025**

**సి.ఎన్.మూర్తి ,**
**ఎస్.బాబు సాహెబ్,**
వాదిపరం అడ్వకేట్లు,
కర్నూలు.